క్లుప్తంగా

అరుణాచలేశ్వరుని సేవలో హీరో మోహన్‌బాబు



సెంగోల్‌తో ఆలయానికి వస్తున్న మోహన్‌బాబు

వేలూరు: మాజీ రాజ్యసభ సభ్యుడు, సినీ నటుడు మోహన్‌బాబు మంగళవారం సాయంత్రం తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుడిని బుధవారం తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రాజారామ్ ఆధ్వర్యంలో శివాచార్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన తీసుకొచ్చిన సెంగోల్‌తో ఆలయంలోకి ప్రవేశించి స్వామి సన్నిధి, అమ్మన్ సన్నిధిలో పూజలు చేశారు. పలువురు అభిమానులు ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు నటించిన కన్నప్ప చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటూ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసినట్లు మోహన్‌బాబు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా టీచర్లు కృషిచేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఆయన అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, డీవైఈఓ బాలాజి, ఎంఈఓలు మార్కొండయ్యనాయుడు, జయవేలు, హెచ్‌ఎంలు వాగ్దేవి, సుజనకుమారి పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. మొదట స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా పలువురు దాతలు తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం తిరుపతి రూరల్ తనపల్లి క్రాస్‌కు చెందిన ప్రభావతి, భాస్కర్‌నాయుడు దంపతులు రూ.1,02,119లను ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డికి విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన వారికి అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఇంటింటా ఆరోగ్యమే ధ్యేయం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

భాకరాపేట: ఇంటింటి ఆరోగ్యం రాష్ట్రీయ సేవా సమితి ధ్యేయం అని రాస్ అధికారి సీవీ నాయుడు పేర్కొన్నారు. బుధవారం టాటా ట్రస్టు సహకారంతో రాస్ సంస్థ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ చికిత్స శిబిరం చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీ గాండ్లపల్లెలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళల్లో వస్తున్న కేన్సర్ లక్షణాలు ముందుగానే గుర్తించి అవగాహన కల్పించడంతో పాటు, చికిత్స అందిస్తామన్నారు. ప్రత్యేకంగా కేన్సర్‌పై అవగాహన కల్పించడంలో రాస్ సంస్థ ముందుంటుందన్నారు. 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాష్‌కుమార్, రాస్ సిబ్బంది భానుకుమార్, ఉమామహేశ్వరి, సిద్ధమ్మ, భువనేశ్వరి, కవిత పాల్గొన్నారు.

పుత్తూరు- సత్యవేడు బస్సు నడపండి

నారాయణవనం: పుత్తూరు నుంచి సత్యవేడు వరకు ఉదయం బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. బుధవారం సాయంత్రం పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యే ఆదిమూలంను కలిశారు. ఉదయం పుత్తూరు నుంచి సత్యవేడు వరకు వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బస్సు సౌకర్యం లేక పలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఉదయం 7.30 గంటలకు పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సును సత్యవేడు వరకు నడపాలని పుత్తూరు డిపో మేనేజర్‌ను ఫోన్ చేసి చెప్పారు. సిఫారసు లేఖను కూడా ఇచ్చారు.





మంగళం పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ జయంతి, జూనియర్ డాక్టర్లు, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నర్సులు

వైద్యం భేష్

- గత ప్రభుత్వంలో వైద్యానికి ప్రాధాన్యం
- రోగులకు మెరుగైన వైద్య సేవలు
- కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మంగళం పీహెచ్‌సీ

తిరుపతి మంగళం: తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పేదల పాలిట వరప్రదాయినిగా మారింది. గత ప్రభుత్వ విధానాలతో ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. పట్టణ ప్రజలతో సమానంగా గ్రామీణ ప్రాంతాల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణిగా ఉంది. పేరుకే ప్రాథమిక వైద్యశాల అయినా అన్నిరకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ సహకారంతో పెద్దాస్పత్రి తరహాలో రోగులకు అత్యవసర సేవలందించేందుకు నిపుణులైన వైద్యులు, టెక్నీషియన్లు, వైద్యసిబ్బంది పనిచేస్తూ ఉంటారు. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా ఆస్పత్రి అండగా నిలుస్తోంది.

పల్లెవాసులకు అండగా..

తిరుపతి నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంగళం పరిసర ప్రాంతాల్లోని గ్రామాల పల్లెవాసులకు వైద్య సేవలందిస్తోంది. తిరుపతి నగర శివారు ప్రాంతాల్లో నివశిస్తున్న వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్యాలను పరిరక్షిస్తోంది. 2011లో మంగళం సమీపంలోని సప్తగిరికాలనీలో ఆస్పత్రిని ఒక చిన్న రేకుల షెడ్డులో ఏర్పాటు చేశారు. అప్పట్లో తిరుపతి అర్బన్, రూరల్ మండలాలతో పరిధిలోని పంచాయతీలతోపాటుగా తిరుమలకు కూడా ఈ ఆస్పత్రికి అనుసంధానం చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు వైద్యసేవలందించారు. అయితే రూరల్ మండలం పరిధిలో వైద్యసదుపాయాలు అందుబాటులోకి వచ్చిన తరువాత, ఇప్పుడు అర్బన్ మండలం పరిధి, తిరుమల పరిధిలో నివసించేవారికి వైద్య సేవలందుతున్నాయి. ఆస్పత్రిలో నిత్యం వందమందికి పైగా వైద్యసేవలు పొందుతూ ఉంటారు. మంగళం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో



రోగుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లు

ప్రత్యేక వైద్యశిబిరాల నిర్వహణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ ఉంటారు. గతంలో అత్యవసర పరిస్థితుల్లోనైనా, కనీసం జర్వానికైనా వైద్యం కోసం నగరం వైపు రోగులు పరుగులు పెట్టాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు అన్ని సమయాల్లో ఆస్పత్రి సేవలందిస్తున్న కారణంగా పల్లెజనం ఊపిరి పీల్చుకుంటున్నారు. ఏడు పడకల సామర్థ్యంతో ఆస్పత్రి వైద్య సేవలందిస్తోంది. ఇద్దరు నిపుణులైన వైద్యులు, 12 మంది వైద్యసిబ్బంది పనిచేస్తున్నారు. అంతేకాకుండా ఆస్పత్రికి ప్రత్యేకంగా ల్యాబ్, టీబీ రోగుల యూనిట్, బాలింతల వార్డు, ఫిజియోథెరపీ వార్డు ఉన్నాయి.

ఆహ్లాదకర వాతావరణంలో వైద్యసేవలు..

మంగళం సప్తగిరినగర్ పంచాయతీలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలందిస్తున్నారు. అందులోనూ పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణంలో అక్కడి డాక్టర్లు వైద్యసేవలందిస్తున్నారు. దాంతో రోగులు సైతం తమ జబ్బులపై ఆందోళన చెందకుండా ప్రశాంతగా వైద్యం చేయించుకుంటున్నారు. దానికి తోడు పీహెచ్‌సీలోని వైద్యుల నుంచి నర్సులు సైతం రోగులను



వైద్య సేవలు అందిస్తున్న నర్సు

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం..

మంగళం పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్స్ కలగకుండా పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం. దాంతో పాటు బాలింతలు డెలివరీ టైం వరకు తమ పీహెచ్‌సీలో వారికి అవసరమైన వైద్యసేవలు అందించడంతో పాటు ప్రతి బుధ, శనివారాలలో తిరుపతి ప్రసూతి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఎక్సర్‌సైజ్‌లు, వారు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతిరోజూ వందకుపైగా రోగులు వస్తున్నారు. రోగులకు వైద్యం అందించి, ఉచితంగా మందులు అందిస్తున్నాం.

డాక్టర్ జయంతి, మంగళం పీహెచ్‌సీ

చిరునవ్వుతో పలకరిస్తుండడంతో రోగులకు సగం జబ్బు నయం అయిపోతోందని రోగులే చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులలో డబ్బులు ఖర్చు పెట్టి చూపించుకున్నా ఇంతగా ఆప్యాయత చూపరని రోగులు చెబుతున్నారు.



మందులు తీసుకుంటున్న రోగులు



కూర్చోవడానికి ఏర్పాటు చేసిన కుర్చీలు



రోగులకు మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం

తొట్టంబేడు : మహిళలకు సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సెర్ప్ లైవ్లీ హుడ్స్ డైరెక్టర్ పద్మావతి అన్నారు. శ్రీకాళహస్తి మండల వెలుగు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్‌వీఈపీ రుణాలను వంద శాతం రికవరీ చేసి, వాటిని సుస్థిర జీవనోపాధుల కల్పనకు అవసరమైన రుణాలను మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆసక్తి కలిగిన మహిళా సభ్యులు వ్యాపారాలు ప్రారంభించేందుకు, విస్తరించేందుకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, స్త్రీనిధి, ఉన్నతి బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలం నుంచి ఆగస్టు మొదటి వారంలోపు వంద



మాట్లాడుతున్న సెర్ప్ లైవ్లీ హుడ్స్ డైరెక్టర్ పద్మావతి

మందికి తక్కువ కాకుండా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, సెర్ప్ ఎఫ్‌పీఓ డీపీఎం శ్రీనివాసులు, పీఈ శేఖర్, జిల్లా స్త్రీనిధి ఏజీఎం హేమంత్‌కుమార్, ఎఫ్‌పీఓ ఏపీఎంలు సింగన్న, ఆదినారాయణ, ఏసీ ధనంజయరెడ్డి, ఏపీఎంలు మునెయ్య, గురుమూర్తి, పళని, నరసింహులు పాల్గొన్నారు.

ఇటు చూడరేమి గోవిందా!



తిరుపతి ఆర్టీసీ బస్టాండ్

- రెట్టింపు ధరలతో ప్రయాణికుల జేబులకు చిల్లు
- రాకపోకల మార్గం పగుళ్లు బారి, సిమెంటు పైకి లేచి అవస్థలు
- దుకాణాల వద్ద చెత్తకుప్పలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- తిరుపతి సెంట్రల్ బస్టాండులో అడుగు పెడితే ఇంతే!

తిరుపతి అర్బన్: తిరుపతి అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది ఏడుకొండల వేంకటేశ్వరస్వామి. శ్రీవారి దర్శనార్థం దూర ప్రాంతాల నుంచి ఎంతో భక్తిభావంతో వచ్చే వారికి తిరుపతి బస్టాండులో దిగగానే కన్పించే అధ్వాన పరిస్థితులు, ధరల మోతతో దుకాణాలు ప్రయాణికుల జేబులు కొల్లగొడుతున్న వైనం, గుంతలమయమైన ప్రాంతాలు, భూకంపం వస్తే భూమి పగుళ్లు బారినట్టు బస్టాండు ఏ వైపు చూసినా అధ్వానంగా ఉంటున్న బస్సు రాకపోకల మార్గాలు..ఇవన్నీ చూసి మరోసారి తిరుపతికి వద్దురా సామీ! అనేలా ఉంటున్నాయి. జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల్లో 504 ఆర్టీసీ దుకాణాలున్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.52 కోట్ల అద్దె వస్తుంది. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ విషయానికి వస్తే 155 దుకాణాలు ఉన్నాయి. అద్దెలో 40శాతం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచే వస్తోంది. అయితే ఈ బస్టాండ్‌లోని దుకాణాల్లో ఏ వస్తువైనా ఎంఆర్‌పీకి ఇస్తున్న పాపానపోవడం లేదు. అధిక ధరలతో దోచుకుంటున్నారు. రాత్రయితే ధరల బాదుడు మరీ ఎక్కువ. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఈడీలు సైతం ధరలను కట్టడి చేయాలని ఆదేశించినా, అడపాదడపా దుకాణదారులకు జరిమానా విధిస్తున్నా వారిలో మార్పు లేదు సరికదా..యథేచ్ఛగా ధరల దోపిడీ పర్వం కొనసాగుతోంది. ఇది అధికారులకు తెలియంది కాదు. ప్రయాణికులు, భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న పాపానపోవడం లేదు.

మరో వైపు సెంట్రల్ బస్టాండ్ వ్యర్థాలకు నిలయంగా మారుతోంది. శ్రీనివాస బస్టాండ్ మేడపై ఏళ్ల తరబడి నిల్వ ఉన్న చెత్తతోపాటు ఇతర దుకాణ సామగ్రిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా శ్రీహరి బస్టాండ్‌లో మూతవేసిన దుకాణాల వద్ద చెత్తకుప్పలు నిత్యం దర్శనమిస్తున్నాయి. ఏడుకొండల బస్టాండ్‌లో టీటీడీకి చెందిన దర్శన టికెట్ కౌంటర్ మూసివేయడంతో ఆ ప్రాంతంలో చెత్తకుప్పలు పెరిగిపోతున్నాయి. గతంలో ఈ చెత్తకుప్పలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నిప్రమాదం సైతం చోటుచేసుకుంది. సెంట్రల్ బస్టాండ్ మొత్తం గుంతలమయంగా మారింది. పచ్చికాపల్లం వైపు వెళ్లే బస్టాండ్ వద్ద పెద్ద పెద్ద గుంతలు తయారయ్యాయి.

ప్రత్యేక నిఘా పెడతాం

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో వ్యర్థాలను పూర్తిగా తొలగించి..పరిశుభ్రంగా ఉంచడానికి కృషిచేస్తాం. ఎమ్మార్పీకే అమ్మాలని దుకాణదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. అధిక ధరలకు విక్రయించినా, దుకాణానికి కేటాయించిన స్థలాన్ని మించి ముందుకు వచ్చి వ్యాపారం చేసినా వారికి అపరాధ రుసుం విధిస్తున్నాం. అయినా వారిలో మార్పు రాకుంటే ఆర్టీసీ నిబంధనల మేరకు చర్యలు తప్పవు.

-డీఆర్ నాయుడు, ఏటీఎం, తిరుపతి సెంట్రల్ బస్టాండ్

ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్

- వేమూరులో క్షేత్ర పరిశీలన చేసిన సెర్ఫ్ డైరెక్టర్ పద్మావతి

తిరుపతి రూరల్: తిరుపతి ప్రాంతంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు భేషుగ్గా ఉన్నాయని సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ పద్మావతి కొనియాడారు. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో దామా అయ్యప్పనాయుడు వ్యవసాయ క్షేత్రంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను బుధవారం ఆమె సందర్శించారు. వర్మికంపోస్ట్ తయారీ, పట్టుపరిశ్రమ, మామిడి, పీఎండీఎస్ విధానాలపై ఆయన అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయంతో ఎంత



అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న పద్మావతి

ఆదాయాలను ఆర్జిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, శ్రీనివాస్, అయ్యప్పనాయుడు, ధనంజయరెడ్డి, ఏపీఎం ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

– చంద్రగిరి డీఎస్పీ నర్సింగప్ప

తిరుపతి రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి డీఎస్పీ నర్సింగప్ప హెచ్చరించారు. చంద్రగిరి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రగిరి సబ్ డివిజన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, ఆ ప్రదేశాల్లో శుభ్రం చేయించడంతోపాటు అక్కడ మద్యం తాగకుండా ఉండేవిధంగా తగిన



మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింగప్ప

చర్యలు చేపట్టామన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం లాంటి వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. మద్యం తాగడం అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిత్యం, బ్లూకోర్ట్స్, రక్షక్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం వెలుపల సిక్కిం మంత్రి అరుణ్‌కుమార్



ఆక్టోపస్ ఐజీ శ్రీకాంత్

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం సిక్కిం రాష్ట్ర మంత్రి అరుణ్‌కుమార్, ఆక్టోపస్ ఐజీ శ్రీకాంత్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. వీరిని టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

బంగ్లా పనులు వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

– కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నివాసం కోసం నిర్మిస్తున్న కమిషనర్ బంగ్లా నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ పరిశీలించారు. పనుల వేగవంతం చేయాలని తిరుపతి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతంలోని ఫిల్టర్ హౌస్ ప్రాంగణంలో కమిషనర్ నివాసం కోసం బంగ్లాను, క్యాంప్ కార్యాలయాన్ని నిర్మిస్తుండగా.. పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ తేజశ్విని, కాంట్రాక్టర్లు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక

తిరుపతి తుడా: టీటీడీ ఈఓ శ్యామలరావును తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ తిరుమలలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈఓ శ్యామలరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ అదితిసింగ్

వైభవంగా ప్రదోష పూజలు



ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం త్రయోదశి సందర్భంగా ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ సాగింది. సాయం సంధ్య వేళ ప్రదోష పూజలు వేదోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని నందీశ్వరస్వామికి, శ్రీవాల్మీకేశ్వరస్వామికి ఏకకాలంలో వివిధ రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఓం నమశ్శివాయ నామస్మరణలు మిన్నంటాయి. ఊత్తుకోట్టై తాలూకా పొందవాక్కం గ్రామానికి చెందిన ఎస్‌బీ హరి కుటుంబ సభ్యులు కార్యక్రమాలకు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి, పాలక మండలి సభ్యుడు ఆనందయ్య, సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో పల్లకిపై స్వామివారిని కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.